


ఆలనాడు దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి జాత్యహంకారానికి నలిగిపోయింది నిగ్రోజాతి. తిరగబడింది. రెండుజాతుల వైషమ్యాలకు, దౌష్ట్యాలకు, కార్పణ్యాలకు ప్రతీకగా ఆ పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయింది. అయితే. స్వతంత్ర భారతావనిలో సాంఘిక, ఆర్థిక, రాజకీయవర్గ కట్టుబాట్లు విషవృక్షంలా పాతుకుపోయి మనిషి తోటిమనిషిని తనకన్నా క్రింది స్థాయిలో వున్నారన్న అలుసుతో అలసత్వంతో—ద్వేష్టానికీ, దోపిడీకి గురిచేస్తూన్న ఈనాటి ఈ వ్యవస్థలో మనలో ఏ మూలో ఉన్న దైవత్వానికి సజీవసమాధికట్టి అహంతో, మదంతో, మాత్సర్యంతో కుత్సితంతో బ్రతుకుతున్న నికృష్ట భావసాంప్రదాయాన్ని సమూలంగా తుడిచిపెట్టి మనిషిని సమస్థాయిలో చూస్తూ మానవత్వపు విలువలను గుర్తించే ఆ రోజు ఎప్పుడొస్తుందో!

కనీసం మనఇంట్లో పని చేసే మనిషినీ. ఆఫీసులో మన దగ్గర పనిచేసే బంట్రోతునూ అసలైన తోటి మనుషులుగా మానవతా దృక్పధంతో మనం చూడడం మొదలుపెట్టడం ద్వారా ఈ మార్పుకు అంకురార్పణ చేయలేమా? ఒకఅద్భుత కపోల చిత్ర రచనకు నాంది పలకలేమా?

అదిగో! అలాంటి చిరు ప్రయత్నానికి ఆలోచన చేయలేమని ప్రశ్నిస్తుంది "దర్శనం."

విహారయాత్ర చేసినట్లు, ఉల్లాసపు ఉయ్యాలలూగినట్లు సాగిపోతుంది కథనం. ప్రాచీన వైభవాలను రంగరిస్తూనే, అంతర్లీనంగా సాగే ఏదో అంతుబట్టని విషాదరాగం విన్పిస్తూనే. చివరిగా ఒక్కసారిగా హిమవన్నగ శిఖరాన్నుంచి ఎడారి యిసుక దిబ్బల్లోకి పారకుడ్ని విసిరివేస్తాడు రచయిత. గుండెగదిలో సల్ఫూరిక్ ఎసిడ్ ఒలికిన అనుభూతి. కనుగుడ్లకు యవనిక సన్నటి కన్నీటి పొర. మరోసారి చదివినా మారని పరిస్థితి—స్పందించిన మనసులోని పొరలు తోటిమనిషి ఏ స్థాయిలో ఉన్నా వారైనా సమాదరించాలన్న క్షణికమైన ప్రకంపనలను కలిగిస్తాయి. ఈ కోరికకే ఎప్పుడూ, ఎల్లప్పుడూ కట్టుబడి ఉండగలిగితే!

నిజాయితీని నింపుకున్న ఒక రచన ఇంతకన్నా సాధించాల్సిన ప్రయోజనం ఏం వుంది? ఏం వుంటుంది?

—వై. రాంబాబు అండ్ శాయి.

బస్సు కిటికీలోంచే చూశాను నారాయణని. బస్టాండులో పెట్రోలు బంక్ దగ్గర నిలబడి ఆత్రంగా చూస్తున్నాడు. ముందుగా మేం వస్తున్నట్లు రాశానేమో టంచనుగా మమ్మల్ని ఆహ్వానించడానికి వచ్చేడు. "నే చెప్ప లేదూ. అదిగో మనకోసం వచ్చాడు నారాయణ" అని విశ్వానికి నారాయణను చూపించాను.

నారాయణ ఎంత హితుడో, సన్నిహితుడో విశ్వంకూడ అంతే నాకు. కానీ....నారాయణకూ విశ్వానికీ మధ్య ఎంత తేడా?

పదోతరగతిలోనే చదువాపేసి ఉన్న వూళ్ళోనే చిన్న ఉద్యోగం సంపాదించుకుని నారాయణ కుటుంబ భారాన్ని లాగుతుంటే, తరగని ఆస్తికి వారసుడుగా తల్లిదండ్రులనుంచి తనక్కావలసిన డబ్బు రప్పించుకుంటూ ఉస్మానియా యూనివర్శిటీలో తెలుగులో రిసెర్చి చేస్తున్నాడు విశ్వం.

వారంరోజుల క్రితం ఉత్తరం రాశాడు విశ్వం. తనకో వారం రోజులు సెలవులు లభించబోతున్నాయనీ, యాంత్రికమైన ఆ వాతావరణానికి దూరంగా కొద్దిరోజులు నాతో గడపాలని వుందనీ, విశాఖ పరిసర క్షేత్రాలూ, స్థలాలూ చూడాలనీ.

సంతోషంగానే రమ్మని రాశాను.

రెండు రోజుల క్రితం వచ్చాడు విశ్వం. అరకులోయ, సింహాచల క్షేత్రము, సాగరదుర్గ, కనక మహాలక్ష్మి, వెంకటేశ్వరమెట్ట, రామకృష్ణా మిషన్ బీచ్, కథలలో ప్రాశస్త్యాన్ని పొందిన ఎర్రమట్టిదిబ్బలూ. ఊపిరాడ నట్టు చూశాం.

మానవాళి మహోదయానికి స్ఫూర్తినిచ్చే ఆదిత్యుని ఆలయం చూసే ప్రయత్నమే యీ అరసవల్లి ప్రయాణం.

విశ్వాన్నీ, నారాయణనీ, పరస్పరం పరిచయం చేశాక, ఇక నీదే బాధ్యత. విశ్వానికి ఏమేం చూపించ దలచావో. సాయంకాలం బస్సులో వెళ్ళిపోవాలి మరి మేం.' అన్నాను నారాయణతో.

"ముందు మా అతిథ్యాన్ని స్వీకరించండి. తర్వాత బయల్దేరుదాం" అంటూ తనింటికి తీసుకు వెళ్ళాడు నారాయణ.

చిన్న పెంకుటిల్లు. చుట్టూ వెదురు ఫెన్సింగు,ఇంటిముందు అరటి, మామిడిచెట్లు కూరగాయల పాదులు, పారిజాతం, నంది వర్థనం, మొదలైన పూలమొక్కలు.

"చక్కగా ప్రశాంతంగా వుంది ఇల్లు"మెచ్చుకున్నాడు విశ్వం. అల్పాహారం, కాఫీలు అయి, బయల్దేరేసర్కి తొమ్మిదయింది.

నారాయణ పుట్టిందీ, పెరిగిందీ అక్కడే కావడంవల్ల అక్కడి స్థలాలూ వాటి చరిత్రలూ అతనికి కొట్టినపిండే.

మరో పావుగంటలో రిక్షాలు సూర్యదేవాలయంముందు ఆగేయి.

"ఇదే అరుణదేవుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి.దేశంమొత్తం మీద ఉన్న రెండు మూడు సూర్యదేవాలయాల్లో ప్రతినిత్యం సకల లాంఛనాలతో పూజలందుకుంటున్న సూర్యదేవాలయం యిదొక్కటే అంటారు.

....సూర్యభగవానుడు ప్రత్యక్ష దైవంగదా. అంచేత భక్తులు పెద్ద సంఖ్యలో వస్తూ తమ మొక్కుబడులను తీర్చుకుంటూ వుంటారు. ముఖ్యంగా మాఘమాసంలో వచ్చే రథసప్తమికి యిక్కడకు భారీఎత్తున భక్తులొస్తారు. కనులపండువుగా వేడుకలు జరుగుతాయి.

—ఈ ఆలయ గర్భగుడిలోని మూలవిరాట్ చూశారా? ఇది కృష్ణశిలతో మల్చబడిన ఏకశిలా విగ్రహం. సుమారు అరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు వుంటుంది. అదిగో ఆయన పాదాల చెంతనే ముగ్గురు దేవేరులు—ఛాయ, ఉష, పద్మిని—అటు అధో భాగాన అనూ

రుడు రథసారధిగా, సప్తాశ్వరథంపై అభయ ముద్రతో సూర్యభగవానుడు.

ఇక, యిక్కడి యీ ఆదిత్య, అంబిక, విష్ణు, మహేశ్వర, గణేశ్వర, నందీశ్వర, విగ్రహాలు వైష్ణవశైవ మతాల సమన్వయత్వాన్ని సూచిస్తాయి.

....ఈ మూలవిరాట్ ప్రతిష్ట క్రీ. శ. 676—688 మధ్య కాలంలో జరిగినట్టు చరిత్ర చెబుతోంది.

ప్రతియేడూ సూర్యుడు ఉత్తర దక్షిణాయణానాలకు మారే సమయంలో ప్రభాత భానుని లేతకిరణాలు గర్భగుడిలోకి ఐదుమార్గాల గుండా చొచ్చుకువచ్చి మూలవిరాట్ పాదాలు, నాభి, శిరోభాగాలను తాకుతాయి. ఇదొక గొప్ప విశేషం"

నారాయణ చెప్పే ప్రతి అంశాన్నీ ఆత్రంగావింటూ, ఆవలోకిస్తూ అవసరమైన విషయాల్ని తన డైరీలో నోట్ చేసుకున్నాడు విశ్వం.

అక్కడ్నించి శ్రీ కూర్మక్షేత్రానికి బస్సులో తీసుకెళ్ళాడు నారాయణ.

"అతి ప్రాచీనమైన ఆలయాల్లో శ్రీకూర్మంకూడా ఒకటి" చెప్పడం మొదలుపెట్టాడు నారాయణ.

అక్కడవుండే శిల్పకళ మతోన్మాదుల దాడులకు ధ్వంసమైందనీ వచ్చేభక్తులకు తగిన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నిధులు లేక దేవాలయం అతి దయనీయమైనస్థితిలో వుందనీ తన ఆవేదనను వ్యక్తం చేశాడు నారాయణ. మాతోనేఉంటూ ఒకగైడ్‌గా వ్యవహరిస్తూ ఆయా ప్రాంతాలకు చెందిన చారిత్రాత్మక విశేషాలను అతనుచెప్పడం విశ్వానికీ నాకూ ఎంతో ఆనందాన్ని కలుగజేసింది.

మధ్యాహ్న భోజనానంతరం కాస్సేపు పిచ్చాపాటి అయ్యాక "మనం ఇప్పుడు వెళ్ళేది కళ్ళేపల్లి" అన్నాడు నారాయణ.

"ఏముందక్కడ?"

"నాగావళి నదీతీరం పొడవునా వుండే అయిదు శివాలయాల్లోనూ ఒకటి అక్కడవుంది. అక్కడిదేవుడు మణినాగేశ్వరుడు.మిగిలిన నాలుగూ పాటకేశ్వర, సోమేశ్వర, సంగమేశ్వర, కోపేశ్వరాలు.

....పంచలింగ క్షేత్రంగా వ్యవహరించే యీ లింగాలను అలనాటి బలరాముడు ప్రతిష్ఠించాడనీ, అతని నాగేటిచాలు వెంబడే నాగావళి ఉద్భ వించిందనీ ఇతిహాసం చెబుతూంది."

నారాయణ మాటలువిని, నిండు ఉత్సాహంతో కదిలాడు విశ్వం.

మణి నాగేశ్వరుడి మూలవిరాట్ అర్ధనారీశ్వరుడిగా కన్పిస్తాడు. నలుపు తెలుపుల సంగమమైన ఆ లింగం ముందుభాగం శివుడుగా, వెనుక భాగం గౌరీదేవిగా పరిగణింపబడుతోంది. లింగాకృతి నిలువునా సగానికి చీలివుండి, శిరోభాగంలో పెద్ద రంధ్రంవుంటుంది. ఆ రంధ్రం స్థానే ఒక ప్పుడు పెద్దనాగమణి వుండేదేట.

ఆ కథను అక్కడి అర్చకులు చెబుతూంటే విస్మయంగా విన్నాడు విశ్వం.

నాగావళినదీ సంగమాన్ని చూసి పులకించి పోయాం.

తిరిగివచ్చి నారాయణ ఇంట్లో కాస్సేపుగడిపి, బస్టాండుకొచ్చే సరికి చీకట్లు ముసురుకున్నాయి.

"ఈ రాత్రికి మాయింట్లో వుండిపోతే సంతోషించేవాడిని"అన్నాడు నారాయణ.

"శ్రమతీసుకుని మీరు మాతోగడపడమే చాలు. యింకా మీకు శ్రమకావడ మెందుకూ"అన్నాడు విశ్వం.

నారాయణ మరేం మాట్లాడలేదు.

రాత్రి ఎనిమిది వరకూ బస్సులేదని తెల్సి నిరుత్సాహ పడి పోయాం.

కూర్చునేందుకైనా సదుపాయంలేని యీ బస్టాండులో గడిపే బదులు అంతవరకూ నాగావళి ఒడ్డున గడిపితే మంచిదనిపించింది.

ముగ్గురం కదిలాం. కోపేశ్వరాలయం దగ్గర నాగావళి పిల్ల కాలువలా ప్రవహిస్తోంది. ఒడ్డునవున్న సిమెంటుతిన్నెలపై కూర్చొని చూస్తే ట్యూబులైట్లకాంతిలో వెండిజలతారులా ఉంది నాగావళి.

శ్రమనూ, అలసటనూ మరపించే చల్లనిగాలి. భాషకందని అనుభూతిని విశ్వం కళ్ళలోచూశానా క్షణాన.

నారాయణ యేదో మాట్లాడుతూనే వున్నాడు.

అక్కడ్నించి వచ్చాక బస్టాండు కళావిహీనంగా తోచింది.

ఎనిమిది గంటలకు రావల్సిన బస్సురాలేదు. పది - ఇరవై ముప్పయ్-నిముషాలు గడుస్తూనే ఉన్నాయి.

రోజంతా కూడగట్టుకున్న ఉత్సాహమంతా హరించి పోతోంది.

ఎట్టకేలకు రాత్రి తొమ్మిదిగంటలకు వచ్చింది లశియాడ్ బస్సు. ఎక్కడున్నారో అంతవరకూ. బిలబిల్లాడుతూ ఒక్కమారు చుట్టుముట్టారు జనం. పరుగెత్తుకెళ్ళి ఎలాగో మాకోసం రెండు సీట్లు రిజర్వు చేయించుకొచ్చాడు నారాయణ.

గొప్ప పెన్నిధి దొరికినట్లు లోపలికి జొరబడి కూర్చున్నాం. సీట్లకోసం బస్సుబయట చాలా కోలాహలంగా వుంది.

"నువ్వప్పగించిన బాధ్యతను నెరవేర్చాను" అన్నట్లు నిల్చున్నాడు నారాయణ నా ఎదురుగా....మౌనంగా రోడ్డుమీద.

కృతజ్ఞతలు చెప్పుకునేటంత దూరంలేదు మా మధ్య.

ఉంచేతే గొంతు విడివడలేదు.

నారాయణ వెళ్ళిన అరగంట వరకూ బస్సు కదలనేలేదు. బస్సులో వున్న నలభై ఒక్క సీట్లన్నీ, కూర్చున్న వారినీ నలభై ఒక్కసారి లెక్క పెట్టేడు కండక్టరు. సీట్లు దొరకక చాలామంది జనం బయటే వుండి పోయారు.

"ఆలస్యమైనా సుఖమైన ప్రయాణమే చెయ్యొచ్చయిందురో" అన్నాను.

"మరే. అందులోనూ ఆసియాడ్ బస్సుకదా. ఆసియా ఆటగాళ్ళ సౌఖ్యంకోసం ప్రత్యేకంగా తయారుచేయబడ్డ బస్సులు కదాయివీ. ఆ సౌఖ్యాల్ని వారనుభవించాక తర్వాత మనకు సంక్రమింప జేశారు. మన గౌరవ ప్రభుత్వంవారు. టిక్కెట్టు మీదో రూపాయిన్నర ఫైనువేస్తూ"

విశ్వం మాటల్లో నిజం లేకపోలేదు. మామూలు ఎక్స్‌ప్రెస్ నాన్ స్టాప్ డీలక్సు బస్సుల టిక్కెట్టు ధరకంటె ఏషియాడ్ బస్సులలో టిక్కెట్టుధర కాస్తో కూస్తో ఎక్కువే. కారణం ప్రత్యేక సదుపాయాలూ, అలంకరణలూ.

అద్దాలూ, కుషన్‌లూ, సీటుసీటుకీ ఫేనూ, లైటూ, నిజానికి వీటన్నిటి ధరా యీ పెంచినా టిక్కెట్టుధర మరి తగ్గించలేదు. సామాన్య ప్రజలపై అది తలకి మించిన బారమైనానరే?

చీకటి చిక్కగా వుంది. టైము తొమ్మిదింపావు. బస్సు కిటకిటలాడుతూంది. కండక్టరింకా టిక్కెట్లిస్తున్నాడు. ఆ తతంగం కాస్తా పూర్తయితే బస్సు బయల్దేరుతుందన్న ఆశతో ఓపిగ్గా కూర్చున్నాం!

ఈలోగా బ్రీఫ్‌కేసులు పట్టుకుని యిద్దరు భారీ వ్యక్తులు బస్సెక్కడం నా కంటబడింది. కండక్టర్ని ప్రక్కకు పిలిచి ఏదో మాట్లాడేరు గుట్టుగా.

కండక్టరు మాత్రం గుట్టురట్టుచేసేశాడు.

"ఎలాసార్. చూడండి బస్సుకెపాసిటీ సరిపోయింది. ఇకైనా అడ్జస్టయి" మీకు సీటిస్తామంటే చూడండి నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు.

ఆ ఇద్దరూ యువకులూ బస్సులోని అందరివంకా చూశారు. అందరికీ వారి మాటలు అర్థమైనా ఎవరూ చోటివ్వడానికి ముందుకు రాలేదు. అసలేరాత్రి....అందులోనూ దూరప్రయాణం. అంత డబ్బు పెట్టి టికెట్టు కొని ప్రయాణం చేస్తూ సర్దుకోవాలని ఎవరికనిపిస్తుంది!

ఇక లాభం లేదనుకున్నారోయేమో వాళ్ళు మళ్ళీ కండక్టర్నే పట్టుకున్నారు ఏదోలా చూడమని. తన అవసరం కొద్దీ ఎదుటి వ్యక్తికి ఆశజూపి, ప్రలోభానికి గురిచేసి వీలైతే అవినీతికి కూడ పాల్పడేలా చేయగల సమర్థులు యిటువంటివారే అన్పించింది.

"చూడ్డానికి డాబుగా దర్జాగా వున్నారు. మధ్యదార్లో బస్సాపించి పిస్తోళ్ళు కత్తులు చూపించి డబ్బుదోచుకుంటే ఎవరేం చేయగలరు. రోజూ పేపర్లలో ఎన్ని చూడ్డంలేదు? ముందు సీట్లో ఎవరో గుసగుస లాడుకుంటున్నారు.

ఈలోగా కండక్టర్ దృష్టి వెనకసీట్లలో కూర్చున్న వారిపై బడింది.

"ఎవరయ్యా అక్కడ! టిక్కెట్లు తీశారా" అంటూ వెనక్కి వెళ్ళేడు.

"తీసోక్కవాలి బాబయ్యా. ఇదిగో"అంటూ లాల్చీపక్కజేబులోంచి యాభై రూపాయలనోటు తీసి అందించాడతగాడు.

"ఎంతమంది మీరు?"

"నానూ, మా యాడది, యీ ముసిల్దీ యిద్దరూ పిల్లలూ" అంటున్నాడతడు. ఆ మాటల్లోనూ ముఖంలోనూ పల్లెటూరి అమాయకత్వం తొంగిచూస్తోంది.

"టిక్కెట్లిస్తానుగానీ కాస్తజరిగి కూర్చుని ఆ బాబుకి చోటియ్యిక్కడ"అని అర్డరేసేడు కండక్టరు నోటుతీసుకుంటూ.

అతగాడు తాము కూర్చున్న సీట్లవంక చూశాడు. ఎక్కడా చోటులేదు.

"ఇంకెక్కడి సోటు బాబయ్యా — సోటుంటే కూకోబెట్టండి" అన్నాడు.

ఆ జవాబు కండక్టర్ని సంతృప్తి పరచలేదు.

"పోసిగదాని వూరుకుంటే లాభం లేదయ్యా మీతో. డబ్బులిస్తున్నాంగదాని మారాజుల మనుకుంటే ఎలా. రెక్కట్టుకుని కిందికి దింపేస్తామంటే అంచక్కా సర్దుకు కూచుంటారు"అన్నాడు.

"ఎందుకు దింపేస్తావయ్యా. మావేం టిక్కెట్లు తీయలేదా. బస్సునిండేక వొచ్చినామా? మా నాలుగు సీట్లలోనే మాం కూచున్నాం. ముసిల్దానికొంట్లో బావుండలేదు. మా యాడదానికి పొద్దున్నుంచీ వాంతులు- పిల్లలు తొంగుండే వోయారు. ఇంకెక్కడియ్యాల సోటు? ఆ బాబులే యిక్కడ కూకుని మావే ఆలీసంగా వొస్తే సోటిస్తారేటి?" అన్నాడు.

ఏమైనా అతగాడి వాదనను పట్టించుకోలేదు కండక్టరు.
ఎలాగోలా అక్కడ చోటిస్తేనే బస్సుకదుల్తుందన్నాడు.

వాదనంతా వింటున్నా బస్సులో ఎవరూ ఎటుపక్కా మాట్లాడటం లేదు.

కాస్సేపయాక ముసిల్ది నాను కిందకూసుంటాలే ఆ బాబునే ఇక్కడ కూసోబెట్టు! అంటూ క్రిందకు దిగింది.

సమస్య పరిష్కారమై బస్సుకదిలింది.

కిటికీలోంచి చల్లనిగాలి వీస్తోంది. విశ్వంఆలోచనలో వున్నాడు.

"ఎలాగయితేనేం యీ రోజు అనుకున్నట్లు ఆది దేవుళ్ళ దర్శనము జరిగిపోయింది."అన్నాను మాటల్లోకి దింపాలని.

ఆలోచనల్లోంచి కాస్తయివతలికొచ్చి,

"అవును. మహాత్మ్యంవున్న దేవుళ్ళతో పాటు తమకు అన్యాయం జరుగుతున్నా నోరు మెదపక సహించే దేవుళ్ళనీ, అధికార దర్పంతోనూ నోటిదబాయింపుతోనూ సొమ్ముచేసుకునే దేవుళ్ళనూ బాగానే దర్శించుకున్నాం"అన్నాడు విశ్వం.

నేనేం మాట్లాడలేక పోయాను.

(భారతి. మే 1984)